## ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి
## విద్యుత్ ప్రమాదాల బాధితులకు నష్టపరిహారము నిబంధన, 2017
## (2017 లోని 2వ నిబంధన)

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టము లోని సెక్షన్ 53 ఈ క్రింది వాటికి తగు చర్యలు తీసుకొనవలెనని నిర్దేశిస్తున్నందువలననూ:

(ఏ) (ఉత్పాదన, ప్రసారణ లేక పంపిణీ లేక వర్తకములో నిమగ్నమై యున్న వ్యక్తులతో సహా) విద్యుత్ ఉత్పాదన, ప్రసారణ, లేక పంపిణీ లేక విద్యుత్ వర్తకము, లేక సరఫరా చేయబడిన విద్యుత్ వాడకము లేక విద్యుత్ లైను లేక విద్యుత్ కర్మాగారముల సంస్థాపన, నిర్వహణ మరియు వాడకము వల్ల కలుగు ప్రమాదముల నుండి ప్రజలను రక్షించుట;

(బి) ఏ వ్యక్తికి అయినా శారీరక గాయము కలుగు, ఏవ్యక్తి ఆస్తికి అయినా నష్టము కలుగు, అట్టి ఆస్తిని వినియోగించుకొనుటలో జోక్యము చేసుకొను ప్రమాదములను నివారించుట, లేక తగ్గించుట;

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టములోని సెక్షన్ 73 (సి) విద్యుత్ కర్మాగారములు, విద్యుత్ లైన్లు నిర్మించుటలో నడుపుటలో మరియు నిర్వహణలో భద్రతా చర్యలను నిర్దేశించుట, కేంద్ర విద్యుత్ అధారిటీ యొక్క కృత్యము మరియు విధి అని స్పష్టం చేస్తున్నందువలననూ;

కేంద్ర విద్యుత్ అధారిటీ, విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టములోని సెక్షన్ 177 (2) (బి) ద్వారా లభించిన అధికారములను వినియోగించుచూ, కేంద్ర విద్యుత్ అధారిటీ (విద్యుత్ సరఫరా మరియు భద్రతా చర్యలు) నిబంధన, 2010 ను 20.09.2010న నోటిఫై చేసి, దానికి సవరణ నిబంధన, 2015 ద్వారా సవరణను, 13.04.2015న నోటిఫై చేసి యున్నందువలననూ;

పైన చెప్పబడిన విద్యుత్ సరఫరా మరియు భద్రతా చర్యల నిబంధనలు చేయబడువరకూ, విద్యుత్ ఉత్పాదన, ప్రసారము, సరఫరా, వాడకములలో లోపభూయిష్టమైన లేక ప్రమాదకర స్థితిలోనున్న సాధనము లేక పరికరము వాడుటచే, లేక విద్యుత్ స్పర్శ, లేక సామీప్యము వల్ల, వ్యక్తులకు, ఆస్తులకు హాని కలుగకుండా, రక్షించుటకు చేయబడిన, భారత విద్యుత్ చట్టము, 1910 (1910 లోని 9వ కేంద్ర చట్టము) లోని సెక్షన్ 37 (2) (యఫ్) క్రింద చేయబడిన భారత విద్యుత్ నియమములు, 1956 అమలులో ఉంటున్నందువలననూ;

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టము లోని సెక్షన్ 67 (2) (జె), లైసెన్సుదారుల పనులకు ('పనులు' అను పదము సెక్షన్ 2 (77) లో నిర్వచింపబడినది) సంబంధించిన భద్రతా చర్యల ప్రక్రియను నిర్దేశించుచూ, సంబంధిత ప్రభుత్వము నియమములు చేయవలెనని ఆదేశించుచున్నందున, తదనుసారముగా, భారత ప్రభుత్వము లైసెన్సుదారుల పనుల నియమములు, 2006 మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ఎనర్జీ (పి.ఆర్.II) శాఖ, 27.02.2007న జారీచేసిన జి.ఓ.యం.యస్.నెం.24 లో ఆంధ్రప్రదేశ్ లైసెన్సుదారుల పనుల నియమములు, 2007, రూపొందించియున్నందువలననూ;

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టములోని సెక్షన్‌లు 57, 58, ఒక లైసెన్సుదారుని లేక ఒక తరగతి లైసెన్సుదారుల నిర్వహణ స్థాయిని నిర్ణీత పరచుచున్నవి మరియు లైసెన్సుదారులు నిర్ణీత స్థాయిని పాటించనందువలన బాధితుడైన వ్యక్తికి సంబంధిత మండలి నిర్ణయించు నష్టపరిహారము చెల్లించవల్సిన లైసెన్సుదారుని బాధ్యతను, ఏదేని జరిమానా విధించుటకు లేక ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టుటకు ఎటువంటి భంగము లేకుండా, నిర్దేశించు చున్నందువలననూ;

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టము లోని సెక్షను 57 (1) ని సెక్షన్ 181 (2) (జెడ్‌ఏ) తో కలిపి చదవగా, ఆ సెక్షన్ల క్రింద, రాష్ట్ర మండలి, చట్టమునకు, నియమములకు అనుకూలముగానుండునట్లు, ఒక లైసెన్సుదారుని లేక ఒక తరగతి లైసెన్సుదారుల నిర్వహణ స్థాయిని నిర్దేశించుచూ, నిబంధన చేయవల్సియున్నందువలననూ;

తదనుసారముగా, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (లైసెన్సుదారుల నిర్వహణ స్థాయి) నిబంధన, 2004 లోని 7వ నిబంధన మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ప్రసార నిర్వహణ స్థాయిలు) నిబంధన, 2007 లోని 1వ నిబంధన చేయబడినవి. కానీ ఆ చట్టములు మరియు చట్టపరమైన నియమములు మనుషుల, జంతువుల, ఆస్తుల పరిరక్షణకు భద్రతకు చట్టబద్ధత కల్పిస్తున్నప్పటికీ, అట్లు ఏదేని హానికలిగినప్పుడు నష్టపరిహారమునకు వీలుకలిగించనందువలననూ;

విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టములోని సెక్షన్ 161, ఎవరేని వ్యక్తి యొక్క విద్యుత్ లైన్లలో లేక విద్యుత్ కర్మాగారములో లేక ఏదేని భాగములో లేక దానికి సంబంధించిన విద్యుత్ ఉత్పాదన, ప్రసారము, పంపిణీ, సరఫరా, వాడకములలో ఏదేని ప్రమాదము సంభవించినప్పుడు, దానిని నోటీసు చేసి విచారణ జరుపవలెనని నిర్దేశించుచున్నది. కానీ ఆ ప్రమాదము వలన ప్రాణనష్టము, జంతునష్టము జరిగినా లేక అట్లు జరుగు అవకాశము ఉన్నా లేక దానివలన, ఒక వ్యక్తికి, జంతువుకు గాయము కలిగినా, బాధితుడైన వ్యక్తికి నష్టపరిహారము చెల్లించవలెననే నిబంధన ఏదీ లేనందువలననూ;

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 లోని 30వ రాష్ట్ర చట్టము లోని సెక్షన్ 11 (1) (బి) లో వినియోగదారుల సేవల విషయములో, లైసెన్సుదారుల నిర్వహణ స్థాయిని నిర్ధారించు బాధ్యత ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కర్తవ్యముగా చేయబడినందున, సెక్షన్ 11 (1) (డి) క్రింద

రాష్ట్రములో విద్యుత్ వాడకములో భద్రత పెంచవల్సియున్నందున, సెక్షన్ 33 క్రింద నిర్వహణ స్థాయిని నిర్దేశించు నిబంధన చేయుటకు మండలికి అధికారము ఈయబడినందున, సెక్షన్ 34 క్రింద నిర్వహణ స్థాయిని మొత్తము మీద నిర్ణయించాల్సి ఉన్నందున, సెక్షన్ 35 క్రింద నిర్వహణ స్థాయిల సమాచారము సేకరించాల్సి యున్నందున, సెక్షన్ 54 (2) (ఒ) క్రింద రాష్ట్రములో విద్యుత్ ఉత్పాదన, ప్రసారము, పంపిణీ మరియు సరఫరాలో నిమగ్నమైయున్న వ్యక్తుల నిర్వహణ స్థాయిని నిర్ధారించుచు నిబంధన చేయవల్సియున్నందువలననూ;

భారత శిక్షా స్మృతి, 1860 లోని XLV కేంద్ర చట్టము, ఒక దుడుకు, లేక నిర్లక్ష్యపు చర్య, మనిషి ప్రాణానికి, లేక ఇతరుల శారీరక రక్షణకు ప్రమాదము కలిగించినచో, సెక్షన్ 336 క్రింద, గాయపరచినచో సెక్షన్ 337 క్రింద, తీవ్రమైన గాయము చేసినచో సెక్షన్ 338 క్రింద, మరణమునకు కారణమైనచో 304-ఏ క్రింద శిక్షార్హము చేయబడినందువలననూ;

మనిషి ప్రాణమునకు, లేక ఇతరుల శారీరక రక్షణకు ముప్పు కలిగించు ఒక చర్య లేక చట్ట విరుద్ధమైన లోపము లేక గాయము చేయుట, లేక తీవ్రమైన గాయము చేయుట, లేక సందర్భానుసారముగా, మరణము కలిగించుట కూడా, నష్టపరిహారమునకు అర్హమైన చర్య తీసుకొనదగిన తప్పిదము అయినందువలననూ;

అపాయకరమైన లేక ప్రమాదకరమైన పనులను చేపట్టు ఒక వ్యక్తి, అతని నిర్లక్ష్యమూ, లేక అశ్రద్ధ ఉన్ననూ, లేకున్ననూ, లేక ప్రమాదమును నివారించు చర్యలు తీసుకున్ననూ, మరొక వ్యక్తికి కలిగిన గాయమునకు నష్టపరిహారము చెల్లించవలెననెడి సిద్ధాంతమును, పూర్వన్యాయస్థాన నిర్ణయములు స్పష్టం చేస్తున్నందువలననూ;

న్యాయపరమైన సాంకేతిక ఇబ్బందులు, ప్రక్రియాపరమైన చిక్కులు, సుదీర్ఘమైన, చట్టపరమైన జాప్యముల వలన విద్యుత్ ప్రమాదములకు గురైన బాధితులకు సత్వరమే తగిన పరిహారము లభించనందువలననూ, మానవీయ దృక్పథం దృష్ట్యా, వారికి సత్వరమే తగిన పరిహారము లభించవల్సి యున్నందువలననూ;

కనుక, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి, ఏదేని విద్యుత్ ఉత్పాదన, ప్రసారము, పంపిణీ, వర్తకము, సరఫరా లేక వాడకములో లేక సంస్థాపితము, నిర్మాణము, నిర్వహణ, నడుపుట లేక ఏవేని విద్యుత్ పనులను ఉపయోగించుటలో హాని కలుగకుండా మనుష్యులను, జంతువులను, ఆస్తిని కాపాడుటకు మరియు నిర్ణీత స్థాయిలను పాటించనందున నష్ట పోయిన వ్యక్తికి, లైసెన్సుదారు నష్టపరిహారము ఇచ్చు బాధ్యత కల్పించి, తద్వారా మనుష్యులకు, జంతువులకు, ఆస్తికి హాని కలుగకుండా నివారించుటకు, అట్టి ప్రమాదాలను తగ్గించుటకు, నిబంధన చేయవలెనని నిర్ణయించినందువలననూ;

కనుక, విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టములోని సెక్షన్ 57 (1) ని సెక్షన్ 181 (2) (జెడ్ఏ) తో కలిపి చదువగా వచ్చునట్టి మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 లోని

30వ రాష్ట్ర చట్టములోని సెక్షన్ 54 (2) (ఐ) ద్వారా లభించునట్టి, ఇందుకు అనుకూలించుచున్న అన్ని ఇతర అధికారములను వినియోగించుచూ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ క్రింది నిబంధన చేయుచున్నది:

<u>**అధ్యాయము – I**</u>

**ప్రారంభిక**

**1. సంగ్రహ నామము, విస్తరణ మరియు ప్రారంభము:**

(1) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ ప్రమాదాల బాధితులకు నష్టపరిహారము నిబంధన, 2017 అని పేర్కొనబడును.

(2) ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము మొత్తమునకు విస్తరించును

(3) ఇది జూన్ మొదటి రోజు, 2017న అమలులోనికి వచ్చును.

**2. నిర్వచనములు:**

(1) '**మండలి**' అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము;

(2) '**పోషితులు**' అనగా మరణించిన వ్యక్తికి వర్తించు, వ్యక్తిగత శాసనమును బట్టి, మరణించిన వాని ఎస్టేటుకు వారసులు కాగల వ్యక్తులు అని అర్థము;

(3) '**తీవ్రమైన గాయము**' అనగా భారత శిక్షా స్మృతి, 1860 (1860 లోని XLV కేంద్ర చట్టము) లో సెక్షన్ 320 లో నిర్వచింపబడిన తీవ్రమైన గాయము అని అర్థము;

(4) '**గాయము**' అనగా భారత శిక్షా స్మృతి, 1860 (1860 లోని XLV కేంద్ర చట్టము) లోని సెక్షన్ 319లో నిర్వచింపబడిన గాయము అని అర్థము;

(5) '**లైసెన్సుదారు**' అనగా విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టము లోని సెక్షన్ 14 క్రింద లైసెన్సు మంజూరు చేయబడిన, ఆ నిబంధన క్రింద లైసెన్సుదారునిగా భావింపబడు వానితో సహా, వ్యక్తి అని అర్థము;

**3. అర్థాన్వయము:** ఈ నిబంధనలో వాడబడి, నిర్వచింపబడని పదములు, అభివ్యక్తములు, విద్యుత్ చట్టము, 2003 లో 36వ కేంద్ర చట్టము లేక ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టము, 1998 లోని 30వ రాష్ట్ర చట్టము, వాటి క్రింద చేయబడిన నియమములు, నిబంధనలలో నిర్వచించబడినచో, వరుసగా, వాటికి ఈయబడిన అర్థములనే కలిగియుండును.

## అధ్యాయము - II
## నిర్వహణ స్థాయిలు

**4. భద్రత స్థాయిలు:**

(1) లైసెన్సుదారుల పనులు, విద్యుత్ ఉత్పాదన, ప్రసారము లేక పంపిణీ లేక విద్యుత్ వర్తకము లేక సరఫరా చేయబడిన విద్యుత్ వాడకము వలన కలుగు ప్రమాదముల నుండి (ఉత్పాదన, ప్రసారము లేక పంపిణీ లేక వర్తకములలో నిమగ్నమై యున్న వ్యక్తులతో సహా) ప్రజలను రక్షించునట్లుగా, ఏవ్యక్తికి అయినా శారీరక గాయము లేక ఏ వ్యక్తి ఆస్తికి అయినా నష్టము కలుగు అవకాశములను నివారించునట్లుగా సంస్థాపితము, నిర్మాణము, నిర్వహణ, నడుపుట, వాడుట ఉండవలెను.

(2) లైసెన్సుదారులు, విద్యుత్ స్పర్శ లేక సామీప్యము వలన గానీ లేక విద్యుత్ ఉత్పాదన, ప్రసారము, పంపిణీ, సరఫరా లేక వాడకములలో లోపభూయిష్టమైన లేక ప్రమాదకర పరిస్థితిలోనున్న సాధనము లేక పరికరము వాడుట వలన గానీ, మనుష్యులకు, జంతువులకు, ఆస్తికి హాని కలుగకుండా రక్షించుటకు అవసరమైన అన్ని చర్యలూ, ఆదేశిక భద్రతా ఆవశ్యకతలు పాటించవలెను.

(3) లైసెన్సుదారు, ఎప్పటికప్పుడు సవరించిన విధముగా, కేంద్ర విద్యుత్ అథారిటీ (విద్యుత్ సరఫరా మరియు భద్రతా చర్యలు) నిబంధన, 2010 మరియు విద్యుత్ సరఫరా మరియు భద్రతా చర్యలకు సంబంధించి కేంద్ర విద్యుత్ అథారిటీ, విద్యుత్ చట్టము, 2003 లోని 36వ కేంద్ర చట్టము లోని సెక్షన్లు 53 (ఏ) మరియు (బి), సెక్షన్ 73 (సి) మరియు సెక్షన్ 177 (2) (బి) క్రింద నిర్దేశించునట్టి ఏవేని ఇతర తగు చర్యలు, ఆవశ్యకతలను, తప్పక పాటించవలెను.

**5. నష్టపరిహారము చెల్లించు బాధ్యత:**

(1) పైన చెప్పబడిన క్లాజు (4) లో నిర్దేశించిన నిర్వహణ స్థాయిలను పాటించని లైసెన్సుదారులు, విద్యుత్ ప్రమాదము కారణముగా మనుష్యుల లేక జంతువుల ప్రాణనష్టమునకు లేక మనుష్యులకు, జంతువులకు, ఆస్తికి కలిగిన హానికి గురైన వారికి నష్టపరిహారము చెల్లించవలెను.

(2) మనుష్యులకు, లేక జంతువులకు ప్రాణనష్టము జరిగినట్టి లేక మనుష్యులకు, జంతువులకు గాయము కలిగినట్టి విద్యుత్ ప్రమాదము జరిగినచో, దాని విషయములో, లైసెన్సుదారుపై, తమకు జరిగిన నష్టమును రాబట్టుకొనుటకు, లేక నష్టపరిహారము కొరకు సివిల్ చర్యకు, లేక క్రిమినల్ బాధ్యత మోపి ప్రాసిక్యూషన్ చర్య తీసుకొనుటకు, తగినంత తప్పు, లోపము, దుడుకు చర్య, నిర్లక్ష్యము లేక పొరపాటు ఉన్నా, లేకున్నా, మరే ఇతర శాసనములో ఏమి ఉన్నప్పటికీ, విద్యుత్ ప్రమాదము ప్రధానముగా లైసెన్సుదారుల నిర్వహణ స్థాయిని పాటించుటలోని లోపము వల్ల గాక, మరేదేని ఇతర కారణము, హేతువు యొక్క సరాసరి లేక సామీప్య జోక్యము వలన కలిగిననే తప్ప, లైసెన్సుదారు, ఈ నిబంధనలో నిర్దేశించినంత మేరకు నష్టపరిహారము చెల్లించవలెను:

అయితే, ఆస్తి నష్టము విషయములో, లైసెన్సుదారుని వలన ఏదేని తప్పు, లోపము, దుడుకుచర్య, నిర్లక్ష్యము, లోపము ఉన్నప్పుడు మాత్రమే, నష్టపరిహారము చెల్లించుటకు బాధ్యుడై యుండును.

అంతేగాక, మనుష్య ప్రాణనష్టము ఆత్మహత్యవలన గానీ, లేక హత్య వలన గానీ లేక మనిషికి కలిగిన గాయము ఆత్మహత్యా ప్రయత్నము వలనగానీ లేక హత్యా ప్రయత్నము వలనగానీ అయినచో, లైసెన్సుదారు దానికి ఈ నిబంధన క్రింద ఎటువంటి నష్టపరిహారము చెల్లించుటకు బాధ్యుడై యుండడు.

## <u>అధ్యాయము – III</u>

## నష్టపరిహారము

**6. నష్టపరిహారము యొక్క పరిమాణము:**

(1) విద్యుత్ ప్రమాదము వల్ల మనుష్య ప్రాణ నష్టము జరిగినచో, ఒక్కో వ్యక్తికి అయిదు లక్షల రూపాయలు నష్టపరిహారము చెల్లించవలెను.

(2) విద్యుత్ ప్రమాదమువలన జంతువులకు ప్రాణనష్టము జరిగినప్పుడు, ఈ నిబంధననుసరించి అట్టి జంతువుకు చెల్లించదగు సబబైన నష్టపరిహారము నిర్ణయించుటకు లోబడి, ఒక జంతువుకు గరిష్టముగా ఒక లక్ష రూపాయలకు మించని నష్టపరిహారము చెల్లింపబడవలెను.

(3) మనుష్యులకు, జంతువులకు, లేక ఆస్తికి కలిగిన హానికి చెల్లించదగు నష్టపరిహారము, ఈ నిబంధననుసరించి సబబుగా విలువకట్టి, నిశ్చయింపబడవలెను మరియు వివిధ రకములైన గాయములకు అశక్తతలకు విడివిడిగాను, దేనికది ప్రత్యేకముగాను, ఈ క్రింది 7 నుంచి 12 వరకు క్లాజుల ప్రకారము నష్టపరిహారము చెల్లింపబడవలెను.

**7. శాశ్వత పూర్తి అశక్తత:** విద్యుత్ ప్రమాదము వలన ఒక వ్యక్తికి కలిగిన గాయము కారణముగా, అతను శాశ్వత పూర్తి అశక్తతకు గురి అయినచో, చెల్లించదగు నష్టపరిహారము అయిదు లక్షల రూపాయలు అయి ఉండవలెను.

**8. శాశ్వత పాక్షిక అశక్తత:** విద్యుత్ ప్రమాదము వలన కలిగిన గాయము కారణముగా, ఒక వ్యక్తి శాశ్వత పాక్షిక అశక్తతకు గురి అయినచో, చెల్లించదగు నష్టపరిహారము గరిష్టముగా అయిదు లక్షల రూపాయలుగాను, కనీసము ఒక లక్ష రూపాయలకు తక్కువకాకుండాను, అశక్తత శాతమునకు సమానముగా ఉండవలెను.

**9. తీవ్రమైన గాయము:** విద్యుత్ ప్రమాదము వలన ఒక వ్యక్తికి తగిలిన గాయము తీవ్రమైన గాయము అయినచో చెల్లించదగు నష్టపరిహారము గరిష్టముగా ఒక లక్ష రూపాయలకు మించకుండా ఉండవలెను.

**10. గాయము:** విద్యుత్ ప్రమాదము వలన ఒక వ్యక్తికి కలిగిన హాని గాయముగా మారినచో, చెల్లించదగు నష్టపరిహారము గరిష్టముగా ఇరవై వేల రూపాయలకు మించకుండా ఉండవలెను.

**11. తాత్కాలిక పూర్తి అశక్తత:** అట్లు కలిగిన తీవ్రమైన గాయము ఏదేని కొంత కాలము వరకు తాత్కాలిక పూర్తి అశక్తతకు దారితీసినచో, చెల్లింపదగు నష్టపరిహారము కనీసము యాభైవేల రూపాయలకు తగ్గకుండాను గరిష్టముగా ఒక లక్ష రూపాయలకు మించకుండాను ఉండవలెను.

**12. తాత్కాలిక పాక్షిక అశక్తత:** అట్లు కలిగిన తీవ్రమైన గాయము ఒక పక్షము రోజులకు తక్కువకాని కాలమునకు తాత్కాలిక పాక్షిక అశక్తత కలిగించినచో, చెల్లించదగు నష్టపరిహారము కనీసము ఇరవై అయిదు వేల రూపాయలకు తగ్గకుండాను, యాభై వేల రూపాయలకు మించకుండాను ఉండవలెను.

**13. వైద్య ఖర్చులు:** విద్యుత్ ప్రమాదము వలన కలిగిన గాయములకు హాస్పిటల్‌లో ఉన్న కాలమునకు మరియు / లేక చికిత్సకు అయిన అసలు ఖర్చులు, గాయపడిన వ్యక్తికి లేదా సందర్భానుసారముగా, చనిపోయిన వ్యక్తి పోషితులకు పైన చెప్పిన నష్టపరిహారమునకు అదనముగా చెల్లించబడవలెను.

**14. నష్టపరిహారము నిర్ధారణ చేయుట:** చనిపోయిన లేక గాయపడిన మనిషి, జంతువు లేక ఆస్తి నష్టము విషయములో చెల్లించదగు నష్టపరిహారము పరిమాణము, సంబంధిత లైసెన్సుదారు యొక్క ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరుచే, యుక్తముగాను, సాధ్యమైనదిగాను భావింపబడురీతిలో సేకరించిన సమాచారము, విషయములు మరియు సాక్ష్యమును బట్టి నిర్ణయించబడవలెను.

అయితే, నష్టమునకు గురి అయిన వ్యక్తి ఆమోదించదగు నష్టపరిహారము నిర్ధారించుటకు సంబంధించిన సమాచారము, విషయము, అన్ని అంశముల సాక్ష్యము సంబంధిత లైసెన్సుదారు యొక్క ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు సమక్షములో నుంచవచ్చును మరియు చెల్లింపదగిన నష్టపరిహారము పరిమాణము నిర్ధారించునప్పుడు దానిని పరిశీలించవలెను.

**15. ఇతర హక్కులు మరియు పరిహారములు భంగము కలుగ కుండుట:** పైన చెప్పిన నష్టపరిహారము కోరుట వలన, ఆ వ్యక్తికి పనివారల నష్టపరిహారము చట్టము, 1923 లోని 8వ కేంద్ర చట్టము క్రిందగాని, ఆ సమయమున అమలులోనున్న ఏదేని ఇతర చట్టము క్రిందగాని చెల్లింపదగు నష్టపరిహారము యొక్క హక్కునకు ఎలాంటి భంగము కలుగదు. కానీ ఈ నిబంధన క్రింద చెల్లింపబడిన నష్టపరిహారము, ఏదేని అట్టి ఇతర శాసనము క్రింద, సివిలు లేక ఇతర బాధ్యత క్రింద చెల్లింపబడిన నష్టపరిహారము నిర్ధారణలో పరిగణనలోనికి తీసుకొనబడవలెను.

**16. కాంట్రాక్టులకు, పథకములకు భంగము కలుగకుండుట:** ఈ నిబంధన క్రింద చేయబడిన ఏదేని డబ్బు చెల్లింపు, మరణము లేక శారీరక గాయము లేక ఆస్తి నష్టమునకు నష్టపరిహారము చెల్లించు ఏదేని కాంట్రాక్టు క్రింద, పథకము క్రింద, ఏదేని ఇన్సూరెన్స్ పాలసీ క్రింద చెల్లించవలసిన సొమ్మును క్లెయిము చేయు ఆవ్యక్తి యొక్క హక్కుకు భంగము కలిగించదు.

**17. నష్టపరిహారము యొక్క నియమిత కాల సవరణ:** మండలి, లైసెన్సుదారులను సంప్రదించి, వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణములతో పై (6) నుండి (12) వరకు గల క్లాజులలో వరుసగా నిర్దేశింపబడినట్టి, నష్టపరిహార పరిమితులను, ఈ నిబంధన అమలులోనికి వచ్చిన తేదీ

నుండి రెండు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత, అట్టి ప్రతి పెంపుదల నుండి రెండు సంవత్సరములు ముగిసిన తరువాత, పెంచవచ్చును.

## <u>అధ్యాయము - IV</u>

## ప్రక్రియ

**18. విద్యుత్ ప్రమాద సంఘటన రిపోర్టు:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 13.02.2012 తేదీన జారీ చేసిన జీ.ఓ.యం.యస్.నెం.7 ఎనర్జీ (సర్వీసెస్) శాఖలో చేయబడిన, ప్రమాదాల విషయం తెలియజేయుట (ఫారం, నోటీసు అందజేసిన సమయము) నియమములు, 2012 లోని 3వ నియమము క్రింద పంపబడు ప్రమాదాల వర్తమానమునకుతోడు, విడిగా, సంబంధిత లైసెన్సుదారు యొక్క అదనపు అసిస్టెంటు ఇంజనీరు, లేక అసిస్టెంటు ఇంజనీరు, విద్యుత్ ప్రమాదము విషయము తెల్సిన వెంటనే ఈ నిబంధనలలోని అనుబంధం-I లో ఈయబడిన ఫారంలో, విద్యుత్ ప్రమాదము జరిగిన ఇరవై నాలుగు గంటల లోపల డివిజనల్ ఇంజనీరుకు చేరునట్లు ప్రత్యేక వార్తాహరునిద్వారా డివిజనల్ ఇంజనీరుకు ఒక నివేదిక పంపవలెను.

**19. విచారణ రిపోర్టు:**

విద్యుత్ ప్రమాదముపై రిపోర్టు అందిన వెంటనే, ఆ ప్రమాదముపై వివరముగా విచారణ జరిపి, డివిజనల్ ఇంజనీరు సవివరమైన రిపోర్టును, సంబంధిత అధికారుల ద్వారా, 15 రోజులలోపల ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరుకు సమర్పించవలెను. ఆ రిపోర్టులో డివిజనల్ ఇంజనీరు నష్టపరిహారము పరిమాణము గురించి, దానికి అర్హులైన వ్యక్తుల గురించి నిర్దిష్టమైన సిఫారసు చేయవలెను.

**20. సరినిరూపణ మరియు తుది ఆదేశములు:**

(i) లైసెన్సుదారు యొక్క ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు, అడిషనల్ అసిస్టెంటు ఇంజనీరు లేదా అసిస్టెంటు ఇంజనీరు పంపిన సంఘటన రిపోర్టులోని అంశాలను మరియు డివిజనల్ ఇంజనీరు యొక్క విచారణ రిపోర్టు లోని అంశాలను, స్వయంగా గానీ, ఈ విషయములో ఆయనచే అధకారమీయబడినట్టి లైసెన్సుదారు యొక్క ఇతర అధికారిచేగానీ, క్లాజు 14లో పైన నిబంధించబడిన రీతిలో సరి నిరూపణ చేయించవలెను.

(ii) అటు పిమ్మట, లైసెన్సుదారు యొక్క ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు చెల్లింపవలిసిన నష్టపరిహారము పరిమాణమును, దానికి అర్హులైన వ్యక్తులను అనగా చనిపోయిన వ్యక్తి యొక్క పోషితులను లేక గాయపడిన వ్యక్తిని లేక జంతువు యొక్క, సందర్భానుసారముగా, ఆస్తి యొక్క యజమానిని, నిర్ధారించుచు తుది ఆదేశములు ఈయవచ్చును.

(iii) చెల్లింపవల్సిన నష్టపరిహారము మరియు అవి చెల్లింపదగు వ్యక్తుల సరినిరూపణ నిర్ధారణ మరియు తుది ఆదేశములు, డివిజనల్ ఇంజనీరు నుండి రిపోర్టు అందిన 15 రోజుల లోపల పూర్తి చేయవలెను.

అయితే, వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణములతో, అట్టి సరి నిరూపణ, తుది ఆదేశములు, డివిజనల్ ఇంజనీరు నుండి విచారణ రిపోర్టు అందిన 30 రోజుల కాలావధి లోపల చేయవచ్చును.

**21. తుది ఆదేశము యొక్క వర్తమానము అందించుట:**

విద్యుత్ ప్రమాదము వలన నష్టపరిహారము కొరకు చేసిన అభ్యర్థనపై చేసిన తుది ఆదేశముల కాపీని, దానికి అర్హులైన వ్యక్తులకు, అట్టి ఆదేశము చేసిన ఏడు రోజుల లోపల లైసెన్సుదారు అందజేయవలెను.

**22. నష్టపరిహారము చెల్లింపు:**

ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు యొక్క తుది ఆదేశముల తేదీ నుండి పదిహేను రోజుల లోపల అర్హులైన వారికి నష్టపరిహారము చెల్లింపబడవలెను.

**23. ఐచ్ఛికముగా క్లెయిమ్ చేయుట:**

విద్యుత్ ప్రమాదములో చనిపోయిన వ్యక్తి యొక్క పోషితులు లేక తనకే హాని కలిగిన లేక తన జంతువుకు, తన ఆస్తికి హాని కలిగిన బాధితుడు, ఈ నిబంధనకు అనుబంధం-II లో ఈయబడిన ఫారములో సంబంధిత లైసెన్సుదారు యొక్క ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరుకు నష్టపరిహారమునకై స్వయముగాగానీ పోస్టుద్వారాగానీ క్లెయిమ్ పంపవచ్చును. ఆయన అట్టి క్లెయిమ్‌పై విచారణ జరిపించి, ఈ నిబంధన ప్రకారము నిర్ణయించబడునట్లు చేయవలెను.

అయితే, అట్టి క్లెయిమ్ చేయబడిననూ, లేకున్ననూ, ఈ నిబంధన క్రింద అట్టి నష్టపరిహారము చెల్లింపవల్సియున్నచో, ఈ నిబంధననుసరించి, నష్టపరిహారము యొక్క పరిమాణము, దానికి అర్హులైన వ్యక్తులను నిర్ధారించవలెను.

**24. అశక్తత సర్టిఫికెట్టు:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమము, అశక్తతుల సంక్షేమము (డిడబ్ల్యు) శాఖ, 01.12.2009 తేదీన జారీచేసిన జీ.ఓ.యం.యస్.నెం.31లో, వివిధ రకములైన అశక్తతలను అంచనావేసి, సర్టిఫికెట్ ఇచ్చు ప్రక్రియకు మార్గదర్శకాలను ఇచ్చింది. ఎప్పటికప్పుడు సవరణలు చేయబడిన ఆ జీ.ఓ., ఈ నిబంధన యొక్క ప్రయోజనాల నిమిత్తము అశక్తతను సర్టిఫికేషన్ చేయుటకు తగి యుండును. ఆ ప్రభుత్వ ఉత్తరువులోని అనుబంధం-II క్రింద నిర్దిష్టపరచబడిన నమూనాలో జారీ చేయబడిన ఒక వ్యక్తి యొక్క అశక్తత సర్టిఫికెట్, ఈ నిబంధన ప్రయోజనములకు అట్టి అశక్తత యొక్క సాక్ష్యముగా పరిగణించబడును.

**25. పురోభావన:**

మనుష్యులకు లేక జంతువులకు ప్రాణనష్టము కలిగించిన, లేక మనుష్యులను లేక జంతువులను గాయపరచిన విద్యుత్ ప్రమాద ఘటన, నష్టపరిహారమునకు లైసెన్సుదారుని బాధ్యుని చేయు విషయములో,

క్లాజు 4 లో నిర్దేశించిన నిర్వహణ భద్రతా స్థాయిని లైసెన్సుదారు బహు:శా పాటించలేదని పురోభావన చేయబడును. అట్లుకాదని రుజువు చేసుకొను బాధ్యత లైసెన్సుదారునిపై యుండును.

**26. వడ్డీ:**

సంబంధిత లైసెన్సుదారుని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు యొక్క తుది ఆదేశములలో నిర్ణయించబడిన నష్టపరిహారముల పరిమాణము, విద్యుత్ ప్రమాదము జరిగిన తేదీ నుండి ఆరు నెలల లోపల చెల్లింపబడవలెను మరియు ఏదేని కారణముచే అట్టి చెల్లింపు ఇంకనూ ఆలస్యము చేయబడినచో, ఆ మొత్తము, ఆ తేదీ నుండి, చెల్లింపబడు తేదీ వరకు ఏడాదికి 18% వడ్డీతో సహా చెల్లింపబడవలెను.

**27. అర్హత విషయములో వివాదములు:**

ఒక విద్యుత్ ప్రమాదములో చనిపోయిన వ్యక్తి విషయములో లేక విద్యుత్ ప్రమాదములో చిక్కుకున్న జంతువు, లేక ఆస్తి యొక్క యజమాన్యము విషయములో, నష్టపరిహారమునకు అర్హులు ఎవరన్నది వివాదాస్పదమైనచో లేక బేధాభిప్రాయము ఉన్నచో, ఈ నిబంధనననుసరించి, సంతృప్తికరముగా నిర్ణయించలేనియెడల, సంబంధిత లైసెన్సుదారుని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు, వివాదాస్పద వ్యక్తులను సంబంధిత న్యాయపరిధిలోని సివిల్ కోర్టుకు పంపవచ్చును.

**28. రిజర్వ్ ఫండ్ నుంచి చెల్లింపు:**

ఆ ఆర్థిక సంవత్సరము యొక్క విద్యుత్ రిటైల్ అమ్మకము ట్యారిఫ్ నిర్ధారణ ఉత్తరువులో, పంపిణీ లైసెన్సుదారుల రిటైల్ సరఫరా వ్యాపారము యొక్క సమగ్ర రెవెన్యూ ఆవశ్యకతలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి, అందుకు సంబంధించిన ఉత్తరువుల ద్వారా ఆ ఆర్థిక సంవత్సరమునకు ఏర్పరచిన రిజర్వు ఫండు నుంచి నష్టపరిహారము చెల్లింపబడవలెను.

అయితే, అట్టి నష్టపరిహారము చెల్లించవల్సిన విద్యుత్ ప్రమాదముల విషయములో ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చిక్కుకొని యున్నచో, ఆ విద్యుత్ ప్రమాదము జరిగిన స్థలముపై ప్రాంతీయ అధికారముగల పంపిణీ లైసెన్సుదారుచే నష్టపరిహారము చెల్లింపబడవలెను మరియు పంపిణీ లైసెన్సుదారునిచే ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి చెల్లింపవల్సిన ట్రాన్స్‌మిషన్ ట్యారిఫ్ నుంచి ఆ నష్టపరిహారము చెల్లింపు మినహాయించబడవలెను.

అయితే, నష్టపరిహారము పరిమాణమును మరియు దానికి అర్హులైన వారిని నిర్ణయించుచూ, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు చేసిన తన తుది ఆదేశములను అమలు చేయుటకై, సంబంధిత పంపిణీ లైసెన్సుదారుని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపవలెను.

**29. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్ మరియు విద్యుత్ ఓంబుడ్స్‌మన్ అధికార పరిధి:**

నష్టపరిహారము యొక్క పరిమాణము, దానిని పొందు అర్హతలపై సంబంధిత లైసెన్సుదారుని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరు యొక్క తుది ఆదేశాలపై బాధితుడైన వ్యక్తి, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్, విద్యుత్ ఓంబుడ్స్‌మన్ మరియు వినియోగదారులకు సహాయము నిబంధన, 2016, (2016 లోని 3వ నిబంధన) క్రింద బాధితునిగా పరిగణింపబడును మరియు విద్యుత్ ప్రమాదము జరిగిన ప్రాంతముపై అధికార పరిధిగల వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్‌లో ఫిర్యాదు చేయవచ్చును మరియు ఆ ఫిర్యాదు నిబంధనననుసరించి పరిష్కరించి, నిర్ణయింపబడవలెను.

అయితే, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్ ఉత్తరువుపై, విద్యుత్ ఓంబుడ్స్‌మన్‌కి పరిశీలనకై సమర్పించవచ్చును మరియు అది పై నిబంధనననుసరించి పరిష్కరింపబడవలెను మరియు నిర్ణయింపబడవలెను.

అయితే, పై నిబంధనలోని అధ్యాయము-IV / వినియోగదారులకు సహాయము, ఈ నిబంధన క్రింద ఉత్పన్నమగు అన్ని దరఖాస్తులకు వర్తించును. ఆ నిబంధన క్రింద లైసెన్సుదారుని నోడల్ ఆఫీసరు, సంబంధిత పంపిణీ లైసెన్సుదారుని నోడల్ ఆఫీసరుగా భావింపబడవలెను. ట్రాన్స్‌మిషన్ లైసెన్సుదారుని ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టరుచే నియమింపబడిన ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ యొక్క జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు ఈ నిబంధన క్రింద పై ప్రయోజనములకై నోడల్ ఆఫీసరుగా నుండవలెను.

**30. పాటించనిచో పరిణామములు:**

ఈ నిబంధన క్రింద మండలి యొక్క ఉత్తరువులను, ఆదేశములను పాటించనిచో మరియు ఈ నిబంధన విషయములలో దాని క్రింద చేయబడిన శాసనములు, నియమములు, నిబంధనలను ఉల్లంఘించినచో, అది విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ కేంద్ర చట్టము) లోని సెక్షన్లు 142 మరియు 146 క్రింద పాటించకుండుట మరియు ఉల్లంఘించుటగా భావింపబడును.

**31. మండలికి సమాచారము:**

లైసెన్సుదారులు, తదుపరి వచ్చు ప్రతినెల 15వ తేదీ నాటికి, తమ అధికార పరిధిలో జరిగిన విద్యుత్ ప్రమాదాల వివరములు, ఈ నిబంధనననుసరించి తీసుకొనబడిన చర్యలతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలికి నివేదిక సమర్పించవలెను.

**32. పోషితులకు, బాధితులకు సహాయము:**

విద్యుత్ ప్రమాదములో మరణించిన వ్యక్తి పోషితులకు లేక బాధితులకు సంబంధిత లైసెన్సుదారు వీలున్నంతవరకూ, విద్యుత్ ప్రమాదము వల్ల ఏర్పడిన పరిణామాలను అధిగమించుటకు, ముఖ్యంగా వైద్య చికిత్స, పునరావాసము వంటి సమస్యల పరిష్కారములో తగిన సహాయము చేయవలెను.

## అధ్యాయము – V

## వివిధములు

**33. మిగిలిన అంశములు:**

(i) ఈ నిబంధనలోని అంశములు, తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములోని అంశములకు, నియమములకు, నిబంధనలకు లేక పథకము లేక కాంట్రాక్టులోని అంశములకు అదనముగా యుండును గానీ వాటికి భంగము కలిగించవు.

(ii) ఈ నిబంధనలోనున్నదేదియూ, న్యాయపరమైన విషయములలోను, మండలి ప్రక్రియను దుర్వినియోగపరచకుండుటకు, అవసరమైనట్టి ఉత్తరువులు చేయుటకు, మండలికి గల స్వయంసిద్ధమైన అధికారమును పరిమితి చేయుననీ, అన్యథా ప్రభావితము చేయునని భావింపబడరాదు.

(iii) ప్రత్యేక పరిస్థితులలో, ఒక విషయములో లేక ఒక తరగతికి చెందిన విషయములలో, వ్రాతపూర్వకముగా రికార్డు చేయు కారణముల వల్ల, అవసరమనీ, ఆవశ్యకమనీ, మండలి భావించినచో, ఈ నిబంధనలోని అంశములకు వేరుగా నుండు ఏదేని ప్రక్రియను మండలి అనుసరించుటకు, ఇందులోని దేదియు అడ్డురాదు.

(iv) ఏ నిబంధన చేయబడని విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ కేంద్ర చట్టము) లోని ఏదేని విషయములో వ్యవహరించుటకు, ఏదేని అధికారమును వినియోగించుటకు, ఈ నిబంధనలోనున్నదేదియు, స్పష్టముగాగానీ, భావగర్భితముగాగానీ మండలికి అడ్డురాదు మరియు మండలి అట్టి విషయములలో, అధికారములలో, కృత్యములలో తాను యుక్తమని భావించునట్లు వ్యవహరించవచ్చును.

(v) విద్యుత్ చట్టము, 2003 (2003 లోని కేంద్ర చట్టము) లోని అంశములకు మరియు ఈ నిబంధనకు లోబడి, ఈ నిబంధనను అమలు చేయుటకు, మండలి నిర్దేశించుటకు, ఆదేశించుటకు ఈ నిబంధనచే అధికారమీయబడిన అనేక విషయములలో తగు ప్రక్రియను పాటించుటకు, మండలి, ఎప్పటికప్పుడు, ఉత్తరువులు ఈయవచ్చును లేక ఆదేశములను ఆచరించవచ్చును.

(vi) మండలి ఎప్పుడైనా, ఈ నిబంధనలోని అంశములను చేర్చవచ్చును, వేరు చేయవచ్చును, మార్చవచ్చును, సవరించవచ్చును, వదిలివేయవచ్చును లేక సవరణ చేయవచ్చును.

(vii) ఈ నిబంధనలోని అంశముల అమలులో ఏదేని సమస్య ఎదురైనచో, మండలి, సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా, అట్టి సమస్య తొలగించుటకు అవసరమైన లేక ఆవశ్యకమైన, విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ కేంద్ర చట్టము) లోని అంశములకు అసంగతముకానట్టి, దేనినైనా చేయవచ్చును.

(viii) మండలి, వ్రాతపూర్వకముగా రికార్డు చేయబడు కారణములతో, బాధితులైన వారికి నోటీసు ఇచ్చి, నిర్దేశింపబడినట్టి నియమ నిబంధనలకు లోబడి, నిర్ణీతమైన కేసులో లేక కేసులలో, నిబంధన యొక్క ఏదేని ఆవశ్యకతలను వదలివేయు అధికారము కలిగి యుండును.

**అనుబంధము-I**

**సంఘటన నివేదిక**

1. ప్రమాదము జరిగిన తేదీ మరియు సమయము :
2. ప్రమాదము జరిగిన చోటు
   (గ్రామము/పట్టణము, మండలి, జిల్లా) :
3. ఎవరి అధికార పరిధిలో ప్రమాదము జరిగినదో
   ఆ లైసెన్సుదారుని ఇన్-ఛార్జి అధికారి పదవి పేరు :
4. ప్రమాదము యొక్క స్వభావము, వివరములు :
5. బాధితుల వివరములు
   (ప్రాణాంతకము / ప్రాణాంతకము కానిది)
   (ఏ) మనుష్యుడు
   (బి) జంతువు
   (సి) ఆస్తి
6. ప్రమాదమునకు దారితీసిన కారణముల వివరములు:
   (అవసరమైనచో వేరే కాగితముపై వ్రాసి
   దీనికి జతపరచవలెను)
7. ప్రమాదమును చూసిన వ్యక్తుల వివరములు
   (పేరు, పదవి, చిరునామా మొ॥) :
8. తీసుకొనబడిన చర్య :
9. ఏదైనా ఇతర సమాచారము :

సంతకము:

పేరు & పదవి

**అనుబంధము-II**

**నష్టపరిహారము కోరుటకు ఫారం**

1. ప్రమాదము జరిగిన తేదీ & సమయము :
2. ప్రమాదము జరిగిన స్థలము :
3. ప్రమాదము యొక్క వివరములు :
4. చనిపోయిన లేక గాయపడిన వ్యక్తి (వ్యక్తుల) వివరములు :
   (ఏ) పేరు
   (బి) వయసు
   (సి) పురుషుడు / స్త్రీ
   (డి) చిరునామా
   (ఈ) వృత్తి
5. చనిపోయిన లేక గాయపడిన జంతువు (జంతువుల) వివరములు) :
   (ఏ) వివరణ
   (బి) వయసు
   (సి) విలువ
6. ఆస్తి వివరములు :
   (ఏ) వివరణ
   (బి) విలువ
7. ప్రాణాంతకముకాని ప్రమాదమైనచో తాత్కాలిక/శాశ్వత/పూర్తి/పాక్షిక అశక్తతలు, ఏవైనా ఉన్నచో : (సంబంధిత జిల్లా మెడికల్ బోర్డు లేక అప్పిలేట్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికెట్ జతపరచవలెను)
8. పోషితుల వివరములు :
9. పోలీసులచే యఫ్.ఐ.ఆర్. రిజస్టరు చేయబడినదా లేదా? :

నష్టపరిహారము కోరు వాని సంతకము పేరు

చనిపోయిన/గాయపడిన/జంతువు/ఆస్తితో గల సంబంధము

నష్టపరిహారము కోరు వ్యక్తి సేకరించగలిగినంత మేరకు మరియు అతను సబబు అని తలచు ఇతర సమాచారము జతపరచవలెను.

**మనుష్యులకు:**

1. కోరుచున్న వ్యక్తిని గుర్తించుటకు రుజువు :
2. రిజిస్టరు చేయబడినచో, యఫ్ఐఆర్ కాపీ :
3. శవ పరీక్ష జరుపబడినచో, దాని రిపోర్టు కాపీ :
4. పరిశీలన రిపోర్టు/పంచనామా జరుపబడినచో దాని కాపీ :
5. జారీ చేయబడినచో, మరణ సర్టిఫికెట్ లేక గాయము గురించిన సర్టిఫికెట్ కాపీ :
6. ప్రమాదము జరిగిన తరువాత చనిపోయిన లేక గాయపడిన వ్యక్తి ఫొటో ఉన్నచో, దాని కాపీ :
7. చనిపోయిన వ్యక్తితోగల సంబంధమునకు సాక్ష్యము :
8. హాస్పిటల్‌లో చేరిన/మరియు చికిత్స పొందిన ఖర్చుల సాక్ష్యము :

**జంతువులకు:**

1. నష్టపరిహారము కోరువానిని గుర్తించుటకు రుజువు :
2. యఫ్ఐఆర్ రిజిస్టరు చేయబడినచో దాని కాపీ :
3. శవ పరీక్ష జరుపబడినచో, దాని కాపీ :
4. పరిశీలన రిపోర్టు / పంచనామా జరుపబడినచో దాని కాపీ :
5. మరణ సర్టిఫికెట్ లేక గాయము గురించిన సర్టిఫికెట్ జారీ చేయబడినచో దాని కాపీ :
6. (ప్రమాదము తరువాత) చనిపోయిన లేక గాయపడిన జంతువు ఫొటో ఉన్నచో దాని కాపీ :
7. యజమానిగా సాక్ష్యము మరియు జంతువు(ల) విలువ :

**ఆస్తి:**

1. నష్టపరిహారము కోరువ్యక్తి గుర్తింపునకు రుజువు :
2. రిజిస్టర్ చేయబడినచో యఫ్ఐఆర్ కాపీ :
3. పంచనామా జరుపబడినచో దాని కాపీ :
4. యజమానిగా సాక్ష్యము మరియు ఆస్తి విలువ :

| | | |
|---|---|---|
| **సం.** | **సం.** | **సం.** |
| **(పి.రామ మోహన్)** | **(డా. పి. రఘు)** | **(జస్టిస్ జి. భవానీ ప్రసాద్)** |
| **సభ్యులు** | **సభ్యులు** | **అధ్యక్షులు** |

## ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

## విద్యుత్ ప్రమాదాల బాధితులకు నష్టపరిహారము నిబంధన, 2017

## (2017 లోని 2వ నిబంధన)

**<u>ప్రస్తావనలు</u>**

1. భారత శిక్షా స్మృతి, 1860 లోని XLV కేంద్ర చట్టము నుండి ఉటంకించబడినది:

సెక్షన్ 319. గాయము :-

ఎవరైనా వ్యక్తికి శారీరక నొప్పి, వ్యాధి, దుర్బలత్వము కలిగించినచో, గాయము చేసినట్లు చెప్పబడును.

సెక్షన్ 320. తీవ్రమైన గాయము :-

ఈ క్రింది రకములైన గాయము మాత్రమే "తీవ్రమైన" విగా పరిగణింపబడును :

మొదటిది – పుంసత్వమును కోల్పోవుట.

రెండవది – ఏదైనా ఒక కంటి చూపును శాశ్వతముగా కోల్పోవుట.

మూడవది – ఏదైనా ఒక చెవి వినికిడిని శాశ్వతముగా కోల్పోవుట.

నాలుగవది – ఏదైనా ఒక అవయవము లేక కీలు కోల్పోవుట.

అయిదవది – ఏదైనా ఒక అవయవమును లేక కీలును ధ్వంసం చేయుట, లేక శాశ్వతముగా బలహీనపరచుట.

ఆరవది – తలను లేక ముఖమును శాశ్వతముగా విరూపము చేయుట.

ఏడవది – ఒక ఎముక లేక పన్ను విరుగుట లేక స్థానభ్రంశము నొందుట.

ఎనిమిదవది – ప్రాణహాని కలిగించు ఏదేని గాయమును లేక బాధితునికి ఇరవై రోజుల పాటు తీవ్రమైన శారీరక నొప్పిని కలిగించుట, లేక అతని సాధారణ కృత్యములు నిర్వర్తించలేకుండుట.

2. ఎప్పటికప్పుడు సవరింపబడిన విధముగా, కేంద్ర విద్యుత్ అథారిటీ (భద్రత మరియు విద్యుత్ సరఫరాకు సంబంధించిన చర్యలు) నిబంధన, 2010.

3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎనర్జీ (సర్వీసెస్) శాఖ, 13.02.2012 తేదీ గల జీ.ఓ.యం.యస్.నెం.7 లో జారీచేసిన ప్రమాదముల విషయము తెలియజేయుట (ఫారం, నోటీసు అందజేసిన సమయము) నియమములు, 2012.

4. ఎప్పటికప్పుడు సవరింపబడిన విధముగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమము మరియు అశక్తతుల సంక్షేమం (డిడబ్ల్యు) శాఖ, 01.12.2009 నాటి జీ.ఓ.యం.యస్.నెం.31.

5. ఏపిఈఆర్సి వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరం, విద్యుత్ ఓంబుడ్స్‌మన్ మరియు వినియోగదారులకు సహాయము, నిబంధన, 2016 లోని 3వది.

| సం. | సం. | సం. |
|---|---|---|
| **(పి.రామ మోహన్)** | **(డా. పి. రఘు)** | **(జస్టిస్ జి. భవానీ ప్రసాద్)** |
| **సభ్యులు** | **సభ్యులు** | **అధ్యక్షులు** |

**<u>గమనిక:</u>** నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజాసౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదం మాత్రమే. అధికారిక పాఠం కాదు.